క్లుప్తంగా

నేడు బీజేపీ ధర్నా

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11:30 గంటలకు నిరసన(ధర్నా) కార్యక్రమం చేపట్టనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజి కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉపరాష్ట్రపతి ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రతిపక్ష నాయకులు ప్రవర్తించడాన్ని నిరసిస్తూ ధర్నా చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు.

అంబులెన్స్ సేవలు తనిఖీ


మామడలో పరిశీలిస్తున్న అధికారులు

మామడ: మండల కేంద్రంలో 108 అంబులెన్స్‌ను బుధవారం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో అత్యవసర సమయంలో వినియోగించే పరికరాల పనితీరు రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు, పాముకాటు వంటి అత్యవసర పరిస్థితుల్లో 108ను సద్వినియోగం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట జిల్లా అధికారి మధు, 108 సిబ్బంది సల్కం శేఖర్, ఆజార్ తదితరులు ఉన్నారు.

22న కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో ఈనెల 22న శుక్రవారం ఆర్‌ఎంపీ, పీఎంపీల జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింగ్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

పాఠశాలకు కార్పెట్లు అందజేత

సోన్: మండలంలోని జాఫ్రపూర్ ఉన్నత పాఠశాలకు నిర్మల్‌కు చెందిన ట్యాక్స్ కన్సల్‌టెంట్ పాలిశెట్టి రాజు విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా రూ.ఆరు వేల విలువైన కార్పెట్లను బుధవారం పాఠశాలలో అందించారు. కేవలం చదువుపై మాత్రమే దృష్టి సారించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్, ఉపాధ్యాయులు రమేశ్‌రెడ్డి, ముత్తన్న, అనిత, విజయమాల, ఆసిఫ్‌అలీ, మసీయుద్దీన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి సభ్యులు కృషి చేయాలి

కుంటాల: స్వయం సహాయక సంఘాల బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని డీపీఎం వెంకట సాయిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కుంటాలలో మండల సమైక్య సంఘ భవనంలో వీవోఏలతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలపై చర్చించారు. సమావేశంలో ఏపీఎం అశోక్, సీసీలు పెంటన్న, యూసుఫ్, కవిత, వీఓఏలు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం


విద్యార్థి, టీచర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ఖానాపూర్: జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గణిత సామర్థ్య పరీక్షలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని స్వాతి ప్రతిభ కనబర్చి జిల్లాలో తృతీయస్థానంలో నిలిచింది. డీఈవో రవీందర్‌రెడ్డి ప్రశంసాపత్రంతోపాటు జ్ఞాపిక అందించారు. బుధవారం పాఠశాల ఆవరణలో విద్యార్థితోపాటు గణిత ఉపాధ్యాయురాలు జ్యోతిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

భైంసారూరల్: భైంసా పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ సుభద్రనిలయం విద్యార్థులు క్షేత్ర సందర్శనకు వెళ్లారు. బుధవారం మండలంలోని మాటేగాం గ్రామంలో రైతు ప్రవీణ్‌కుమార్‌ను కలిసి పంటలు పండించే విధానం, డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయంలో ఆధునిక యంత్రాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

‘ఇళ్ల కేటాయింపుపై రీసర్వే చేయాలి’

ఖానాపూర్: పట్టణ శివారులో 400 డబుల్ బెడ్‌రూం ఇళ్లను అనర్హులను కేటాయించారని.. దీనిపై రీసర్వే చేసి అర్హులకు న్యాయం చేయాలని పలువురు పేదలు కోరారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పరిమల్ భౌమిక్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారుల వైఫల్యంతో పేదలకు అన్యాయం జరిగిందన్నారు. దీనిపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామని.. ఇప్పటికైనా అధికారులు కోర్టు ఆదేశాలు పాటిస్తే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. వినతిపత్రాలతోపాటు అభ్యంతరాలు, వివరాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సాజిద్, దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

కంది రైతుకు రంది..

- పంటపై ఓ వైపు తెగుళ్లు.. మరోవైపు అడవిజంతువుల దాడి
- వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని కోరుతున్న అన్నదాతలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువరైతు సీహెచ్.సురేశ్‌ది తానూరు మండలం ఉమ్రి(కే) గ్రామం. తన కున్న మూడెకరాల్లో పత్తి పంట సాగు చేయగా.. అందులో అంతర పంటగా కంది వేశాడు. తొలుత ఆశాజనకంగా ఉన్నా.. పూతదశ కొచ్చేసరికి పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. మరోపక్క అడవి జంతువుల బెడదతో పంట చేతికి రాకుండా పోయింది. మూడెకరాలకు రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చేలా లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పెట్టుబడులకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని వాపోయాడు. జిల్లాలోని కంది సాగు చేసిన చాలా మంది రైతులది ఇదే పరిస్థితి.


తానూరు మండలం హిప్నెల్లి శివారులో తెగుళ్ల బారిన కంది పంట

తానూరు: ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, సోయా, మినుము పంటలకు అధిక వర్షాలతో నష్టం వాటిల్లగా దిగుబడులను కోల్పోయారు. వాటిల్లో అంతరపంటలుగా సాగు చేసిన కంది అయినా ఆదుకుంటుందనకున్న రైతుల ఆశలు అడియాసలవుతున్నాయి. గతేడాది కంటే ఈసారి కందిపంట ఏపుగా పెరగడంతో రైతులు మంచి దిగుబడి వస్తుందని సంబురపడ్డారు. కానీ పూత, కాత దశకు చేరుకోగానే పంటను క్రిమి(లద్దెపురుగు)కీటకాలు ఆశించడంతో నష్టపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఓ వైపు తెగుళ్లు సోకడం.. మరోవైపు అడవి జంతువులు దాడి చేయడంతో చేతికొచ్చిన పంట యాభైశాతం వరకు దెబ్బతిందని వాపోతున్నారు. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి కంది పంటను ఆశిస్తున్న పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

జిల్లాలో..

ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా పత్తి, సోయాల్లో అంతర పంటగా కందిని సుమారు 28వేల ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. భైంసా డివిజన్‌లో ఎక్కువగా సాగు చేసినట్లు పేర్కొన్నారు. పత్తి, సోయా పంటల సాగుకు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టారు. తెగుళ్లు, అడవిజంతువుల దెబ్బతో కనీస దిగుబడులు కూడా వచ్చేలా లేవని రైతులు ఆదోళన చెందుతున్నారు. ఈసారి మార్కెట్‌లో కందులకు క్వింటాల్‌కు రూ.9వేల వరకు ధర పలుకుతుందని పలువురు పేర్కొంటున్నారు.

మందులు పిచికారీ చేస్తున్నా..

కంది పంటకు వారానికోసారి పురుగు మందులు పిచికారీ చేస్తున్నా.. తెగుళ్లు అందుబాటులోకి రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పత్తి, సోయాలకు అధిక దిగుబడుల కోసం పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం రాలేదన్నారు. ఇప్పుడు కంది పంటకు కూడా ఖర్చు తడిసిమోపడవుతున్నా ఫలితం ఉండటం లేదని వాపోతున్నారు.

పిచికారీ చేస్తున్నాం



కంది పంటకు తెగుళ్లు సోకడంతో ఉదయం క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తే పురుగు నశిస్తుంది. మళ్లీ కొద్దిరోజులకే పురుగు వస్తుంది. ఈ ఏడాది పెట్టుబడి రావడం కష్టంగా ఉంది. మరోపక్క అటవీ జంతుల బెడద తీవ్రంగా ఉండడంతో నష్టపోతున్నాం.. ప్రభుత్వమే రైతులకు ఆదుకోవాలి.

– అశోక్, హిప్నెల్లి, మం.తానూరు

అవగాహన కల్పిస్తున్నాం

రైతులు సాగు చేసిన కంది పంట తొలుత ఆశాజనకంగా ఉండేది. పూతదశ కొచ్చేసరికి లద్దె పురుగు సోకింది. అధికారులు గ్రామాల్లోని కంది పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

– అంజిప్రసాద్, డీఏవో

అర్హులను ఓటరుగా నమోదు చేయించండి

ముథోల్: వచ్చే నెల జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండేవారిని ఓటరుగా నమోదు చేయాలని తహసీల్దార్ ఎండీ.అతికొద్దీన్ పేర్కొన్నారు. బుధవారం బీఎల్‌వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓటరుజాబితాలో మార్పులు, చేర్పులు, నూతన ఓటర్ల నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. గ్రామాల బీఎల్‌వోలు ఉన్నారు.

నర్సాపూర్(జి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం బీఎల్‌ఓలకు ఓటరు నమోదుపై శిక్షకులు మనోహర్‌రెడ్డి అవగాహన కల్పించారు. జనవరి1, 2024 నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటుహక్కు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. తప్పుల్లేకుండా జాబితాను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐలు వేణుగోపాల్, సుమలత, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.


నర్సాపూర్(జి)లో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

కుభీర్‌లో..

కుభీర్: వచ్చేనెల ఒకటి నాటికి 18ఏళ్లు నిండేవారు ఓటరుగా దరఖాస్తు చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని తహసీల్దార్ సోము అన్నారు. బుధవారం కుభీర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్‌బూత్ అధికారులు, పర్యవేక్షకుల సామర్థ్యంపై శిక్షణ ఇచ్చారు. బీఎల్‌వోలు ఇంటింటా తిరుగుతూ ఓటరు జాబితాను సవరించి.. మార్పులు, చేర్పులు చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో డీటీ పద్మావతి, మాస్టర్ శిక్షకులు రాజేశ్వర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


కుభీర్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ సోము

వైభవంగా ఆలయాల్లో పూజలు

తానూరు: మండలంలోని బోరిగాం గ్రామంలో బుధవారం హనుమాన్ జాతర సందర్భంగా మహాలక్ష్మి ఆలయంలో భక్తులు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంత రం హనుమాన్ ఆలయం నుంచి బోనాలు ఎత్తుకొని మహాలక్ష్మి ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తరలిరావడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

ముజ్గిలో రామాలయ ప్రతిష్ఠాపన

నిర్మల్‌రూరల్: మండలంలోని ముజ్గిలో నిర్మించిన కల్యాణ రామాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో గణపతిపూజ, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, నవగ్రహ దేవత పూజలు చేశారు. గ్రామస్తులతోపాటు సమీప ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో సర్పంచ్ రాజమణి, రామాలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.


నిర్మల్‌రూరల్: ముజ్గిలో హాజరైన జనం

ముగిసిన విఠలేశ్వరుని జాతర

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామంలో బుధవారం విఠలేశ్వరస్వామి రుక్మిణిదేవి ఆలయంలో జాతర నిర్వహించారు. జాతరకు మహాగాంతోపాటు భైంసా, పార్డి, చాత, హల్దా, గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. వారం రోజులుగా సప్తాహం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కడెం: ధనుర్మాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని సీతారామాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ మహా విష్ణువుకి ప్రీతికరమైన ధనుర్మాసంలో స్వామివారిని పూజిస్తే అష్టఐశ్వర్యాలు కలుగుతాయని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో మండల కేంద్రంతోపాటు కొండుకూర్ గ్రామ భక్తులు ఉన్నారు.


తానూరు: బోరిగాంలో బోనాలతో భక్తులు


కడెంలో పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా అయ్యప్ప పడిపూజ

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో పీఆర్ ఏఈ శ్యామల–ప్రదీప్ దంపతుల నివాసంలో బుధవారం వైభవంగా అయ్యప్ప మహా పడిపూజను నిర్వహించారు. అయ్యప్ప విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. గురుస్వాములు నటరాజ్ ,రాజేందర్, జితేందర్‌రావు, శ్రీనివాస్, నవీన్, రజినీకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.


కుంటాల : అభిషేకం చేస్తున్న ఏఈ దంపతులు

స్వాములకు భిక్ష ఏర్పాటు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌కు చెందిన ముజీబ్ బుధవారం అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేసి మత సామరస్యం చాటి చెప్పారు. మండలంలోని మేడంపల్లి శివారు రామపాదుకల ప్రాంతంలో అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశాడు. పట్టణంలోని శ్రీలలితా పరమేశ్వరి అయ్యప్ప ఆలయంలో మాజీ మంత్రి ఐకేరెడ్డి పీఏ ఒడ్డెపల్లి కృష్ణంరాజు–అనుజ్ఞ దంపతుల ఆధ్వర్యంలో భిక్ష నిర్వహించారు.

కాలభైరవ స్వామికి పూజలు

నిర్మల్‌టౌన్: పట్టణంలోని చింతకుంటవాడలో శ్రీ కాలభైరవ స్వామికి అష్టమి సందర్భంగా అయ్యప్ప స్వాములు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలో గంద్రత్ రమేశ్, అడప పోశెట్టి, కందుల శేఖర్, గంద్రత్ శ్రీకాంత్, రాజశేఖర్, పంతిక రాంకిరణ్, బద్రి రాజశేఖర్, శ్రీహరి, మధు పాల్గొన్నారు.

గాడ్గేబాబా వర్ధంతి

తానూరు: సంత్ గాడ్గేబాబాను ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచ్ విఠల్ అన్నారు. బుధవారం తానూరు పంచాయతీ కార్యాలయంలో గాడ్గేబాబా వర్ధంతి నిర్వహించారు. ఎల్లప్ప, ఉపసర్పంచ్ నయూం, తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని దోబీగల్లీ రజకసంఘ భవనంలో సంత్ గాడ్గేబాబా వర్ధంతి నిర్వహించారు. ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, రజక సంఘం ఆధ్వర్యంలో గాడ్గే చిత్రపటానికి నివాళులర్పించారు. బీఎస్ఐ పట్టణ అధ్యక్షుడు ప్రసంజిత్ హేమ్లే, రజక సంఘం సొసైటీ సభ్యులు భూమన్న, భీమేశ్ తదితరులున్నారు.

అయోధ్య అక్షింతలతో ఊరేగింపు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామంలో బుధవారం అయోధ్య అక్షింతలను ప్రధాన వీధుల గుండా ఊరేగించి భక్తులు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా వారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. గురువారం అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్‌రావు, భక్తులు గంజాల గంగాధర్, మారుతి, భూమన్న పటేల్, భోజప్ప పటేల్, జమదండి గంగాధర్, హోటల్ రాజు తదితరులు ఉన్నారు.


పంచగుడిలో అక్షింతలతో భక్తులు

పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యం

తానూరు: పరిశుభ్రత పాటిస్తేనే రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటామని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని ఎల్విలో పర్యటించారు. వీధులను పరిశీలించి మాట్లాడారు. తడి, పొడి చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేయాలన్నారు. నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.కార్యదర్శి ప్రవీణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇంటిపన్నులు వసూలు చేయాలి

తానూరు: వందశాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దని.. నర్సరీలో పండ్లు, పూల మొక్కలు నాటించేలా చూడాలన్నారు. మురికి కాలువలను శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

దారులన్నీ ధర్మారం వైపే..

- కోతిదేవుడి జాతరకు పోటెత్తిన భక్తులు


ఆలయం వద్ద భక్తుల సందడి

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామంలో బుధవారం జరిగిన కోతిదేవుడి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. మంగళవారం రాత్రి 11 గంటలకు రథోత్సవంతో జాతర ప్రారంభమైంది. కోనేరులో పుణ్యస్నానాల అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలతోపాటు మామడ, సోన్, నిర్మల్‌రూరల్, ఖానాపూర్ మండలాల నుంచి వందలాది మంది వచ్చి పూజలు చేశారు. పీచర నుంచి ధర్మారం గ్రామం వరకు భక్తులు బారులు తీరారు. భక్తులకు మహాఅన్నదానం ఏర్పాటు చేసి సాయంత్రం వరకు కొనసాగించారు. ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యురాలు ప్రత్యూష ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకులు అడ్వాల రమేశ్, అయిండ్ల భూపాల్ రెడ్డి, గోవర్ధన్, చిన్నయ్య తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

భైంసారూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని బోరిగాం, హంపోలి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను సామాన్యులకు చేరవేసేందుకే ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అశోక్, దత్తురాం తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ, నందన్ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రొజెక్టర్ సాయంతో ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ఆయుస్మాన్ భారత్, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, పీఎం పోషణ్ అభియాన్, జన్‌ధన్ యోజన, జీవన్ జ్యోతి బీమా, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య, బ్యాంకు, ఆయుష్మాన్ భారత్ అధికారులు పాల్గొన్నారు.


భైంసారూరల్: యాత్రలో బోరిగాం గ్రామస్తులు

అంధత్వ నివారణకు కృషి

ముథోల్: అంధత్వ నివారణకు భోస్లేగోపాల్‌రావు పాటిల్ కంటి ఆస్పత్రి 27 ఏళ్లుగా కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్ పేర్కొన్నారు. బుధవారం కంటి ఆస్పత్రి 27వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. కంటి ఆస్పత్రిలో నిరుపేదల కు ఉ చితంగా వైద్యపరీక్షలు, శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసియాలోనే ముథోల్ కంటి ఆస్పత్రి ప్రత్యేకంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నా రు. ఇప్పటివరకు 6,68,700 మందికి కంటి పరీక్షలు, 82,614 మంది రోగులకు శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులను స న్మానించారు. ఎల్వీ ప్రసాద్ వైద్య విజ్ఞానసంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, డాక్టర్ వర్షారాటి, డాక్టర్ సోమశిలమూర్తి, అడ్మినిస్ట్రేటర్ జోజి ప్రసాద్, డా క్టర్ దీక్ష, డాక్టర్ యాధా గోయల్, టీఎస్ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్ నరేశ్‌రావు, సందీప్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

భైంసారూరల్: మండలంలోని కామోల్‌లో ఇ టీవల సిలిండర్ పేలి సజీవదహనమైన మహిళా కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావుపటేల్ పరామర్శించారు. బుధవారం కామోల్‌కు వెళ్లి బాధిత కుటుంసభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఇల్లు, రూ.ఐదు లక్షలు వచ్చేలా చూస్తానని పేర్కొన్నారు. వారి వెంట ఆనంద్‌రావుపటేల్, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు పొదుపు అలవర్చుకోవాలి

లోకేశ్వరం: విద్యార్థి దశ నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలని లోకేశ్వరం డీజీబీ మేనేజర్ కల్లూర్ అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాసతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీజీబీ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు అందించే రుణాలు, డిజిటల్ లావాదేవిలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. నిర్మల్‌కు చెందిన చంద్రదాస్ బ్యాంకు లావాదేవీలను మిమిక్రీ చేస్తూ వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అశోక్, పలువురు ఉపాధ్యాయులు రాజేశ్వర్, రమేశ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

కూలీలందరికీ పని కల్పించాలి

సోన్: కూలీలందరికీ పని కల్పించాలని ఎంపీడీవో మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లోకల్‌వెల్మల్, సిద్ధులకుంట, మాదాపూర్, పాక్‌పట్ల గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో పరిశీలించారు. అనంతరం పాక్‌పట్ల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు స్వరూపరాణి, సంగీత, గోపాల్, సంధ్యారాణి, టీఏ, ఎఫ్ఏ తదితరులున్నారు.


లోకల్‌వెల్మల్‌లో పరిశీలిస్తున్న మోహన్‌రెడ్డి

హోంగార్డ్‌కు ఆత్మీయ వీడ్కోలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందుతున్న హోంగార్డ్ ఎం.డీ నసీరొద్దీన్‌కు బుధవారం జిల్లా పోలీస్‌శాఖ తరఫున ఆత్మీయ వీడ్కోలు పలికారు. 30 ఏళ్లుగా నిర్మల్‌లో హోంగార్డుగా పని చేసిన నసిరొద్దీన్‌ను ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ వీరన్న, అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, బ్లూకోర్టు, పెట్రోల్ కార్ డ్రైవర్లు, కార్యాలయాల భద్రత, రాత్రి గస్తీ, బందోబస్త్‌లో హోంగార్డుల పాత్ర కీలకమైనదని కొనియాడారు. హోంగార్డులకు సమస్యలుంటే ఆర్ఐ హోంగార్డ్ ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో హోంగార్డుల ఆర్‌ఐలు రామకృష్ణ, రాంనిరంజన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, హోంగార్డు కుటుంబసభ్యులు, అధికారులు ఉన్నారు.



హోంగార్డును సన్మానిస్తున్న అదనపు ఎస్పీలు

‘అనర్హులకు దివ్యాంగుల సర్టిఫికెట్లు’

ఖానాపూర్: జిల్లాలో కొందరు అధికారులు బ్రోకర్లతో కలిసి అనర్హులకు దివ్యాంగుల సర్టిఫికెట్లు జారీ చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కరికారి రాజేశ్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వందశాతం చెవుడు ఉన్న వ్యక్తులకు ఇవ్వడం లేదని.. కానీ బ్రోకర్‌ల ద్వారా వచ్చేవారు 60 నుంచి 65 శాతం చెవుడు ఉన్నప్పటికీ సర్టిఫికెట్ ఇస్తున్నారని వాపోయారు. దీనిపై విచారణ జరిపి జిల్లా వైద్యశాఖ అధికారులను తొలగిస్తే అర్హులకు సర్టిఫికెట్లు అందడంతోపాటు వైద్యసేవలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. సమావేశంలో గంగాధర్, గంగయ్య, పాల్ తదితరులు ఉన్నారు.